మా ఓటమికి అనేక కారణాలు

చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం • ప్రజలతో నేతలకు కొంత గ్యాప్ వచ్చింది

- మాకు, కాంగ్రెస్‌కు తేడా 4 లక్షల ఓట్లు
- ఆత్మవిశ్వాసాన్ని అహంకారమంటే ఎలా?
- సీఎం రేవంత్‌కు రెండేండ్ల సమయం ఇస్తాం
- క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పోరాటాలు చేస్తాం
- ఫిరాయింపులతో నష్టమే ఎక్కువ
- ఢిల్లీలో మీడియాతో కేటీఆర్, హరీశ్

ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. పక్కన హరీశ్‌రావు, సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): పరిపాలనాపరమైన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం వల్ల ప్రజలతో తమకు కొంత గ్యాప్ వచ్చిందని, కర్ణుని చావుకు అనేక కారణాలు అన్నట్టు తమ ఓటమికి అనేక కారణాలున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఈ ఇద్దరు అగ్రనేతలు మంగళవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటున్నామని చెప్పారు. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చటం వల్లే ఓటమిపాలయ్యామనేది సరైన నిర్ధారణ కాదని పేర్కొన్నారు. తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోలేకపోయామని అన్నారు. తమ వైఖరి కొంత మార్చుకోవాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. తాము చేసిన అభివృద్ధి వల్లె హైదరాబాద్‌లో అన్ని సీట్లను గెలిచామని కేటీఆర్ అన్నారు. తాము చేసిన అభివృద్ధి, ప్రజా అనుకూల విధానాల వల్లనే తమకు 39 సీట్లు వచ్చాయని చెప్పారు. మరో 14 స్థానాల్లో 6 వేల ఓట్లతో ఓడిపోయామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తమకు కేవలం 4 లక్షల ఓట్ల తేడాయే ఉన్నదనే విషయాన్ని గమనించాలని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసినా ఓటమి పాలయ్యారని ఆయన ఉదహరించారు. ఏపీలో పవన్‌కల్యాణ్ విడిగా పోటీ చేసి ఉంటే ఫలితాలు వేరుగా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఏపీలో ప్రతిరోజూ జనంలో ఉండే కేతిరెడ్డి ధర్మవరంలో ఓటమి పాలైన ఉదంతాన్ని గుర్తుచేశారు. ఏపీలో జగన్‌ను ఓడించేందుకు షర్మిలను పావులా ఉపయోగించారని అభిప్రాయపడ్డారు.

ఫిరాయింపులతో నష్టమే: హరీశ్‌రావు

పార్టీ ఫిరాయింపులతో లాభం కన్నా నష్టమే ఎక్కువ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గతంలో పార్టీ ఫిరాయింపుల వల్ల బీఆర్ఎస్ పార్టీకి పెద్దగా లాభం జరగలేదని, తమ పార్టీలో చేరిన 10 మంది ఓడిపోయారని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నదని, ఆ తీర్పు ప్రకారం స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన వదిలేసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు తమ చేతుల్లో ఉన్నారని పేర్కొనటం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనమేనని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో పారిశుద్ధ్యం ఎక్కడికక్కడ పేరుకుపోవడం వల్ల ప్రజలు డెంగ్యూ, మలేరియా బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పింఛన్లు ఇవ్వడం లేదని, గ్రామ పంచాయతీల్లో సిబ్బందికి జీతాలు రావటం లేదని, రైతులకు రైతుబంధు వేయటం లేదని, రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ సమస్యలు తీవ్రం అవుతున్నాయని, ప్రజలు మళ్లీ ఇన్వర్టర్లు, జనరేటర్లు కొంటున్నారని, ఇలా ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మార్పు వస్తుందని ఊదరగొట్టిన ప్రచారం పుణ్యమా అని కాంగ్రెస్‌కు పట్టం కడితే తమను ఏమార్చే రోజులు వచ్చాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారు

తమ ఆత్మవిశ్వాసాన్ని అహంకారమని ప్రచారం చేస్తున్నారని, అభివృద్ధిలో తమతో పోటీ పడలేక కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. పాలనపై సీఎం రేవంత్ రెడ్డికి పట్టుకాలేదని పేర్కొన్నారు. డబ్బు సంచులతో దొరికినవాడు తెలంగాణలో సీఎం అయ్యారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి అర్థబలం, అంగబలం అన్నీ ఉన్నా తమ మీద పడి ఏడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌కు రెండేండ్ల సమయం ఇస్తామని, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన అని గొప్పగా చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి.. సర్కారును ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడితే పోలీసులతో ఫోన్లు చేయించి వాటిని డిలీట్ చేయిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఉన్నది ఆత్మవిశ్వాసం అని, దురదృష్టవశాత్తు అహంకారమని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సమావేశం వల్ల వచ్చే ఫలితాలను బట్టి తమ స్పందన ఉంటుందని అన్నారు. తెలంగాణకు చంద్రబాబు ఉపయోగపడితే మంచిదేనని అంటూనే.. గతంలో ఆయన వైఖరినీ పరిశీలించాలి కదా? అని వ్యాఖ్యానించారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.2°c	24.7°c
మెదక్	34.3°c	23.1°c
రంగారెడ్డి	33.9°c	21.6°c
ఖమ్మం	33.0°c	25.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
నిజామాబాద్	31.9°c	24.7°c
మహబూబ్‌నగర్	31.4°c	23.6°c
వరంగల్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.7°c	24.5°c
నల్లగొండ	30.0°c	23.0°c

చేతిలో రాజ్యాంగం.. చేసేది కుతంత్రం

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీలోని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కేఆర్ సురేశ్‌రెడ్డి నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎవరైనా సరే పార్టీ మారిన వెంటనే అభ్యర్థిత్వం రద్దయ్యేలా చట్టం చేస్తామని చెప్పారని, ఇప్పుడా మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.

అప్పుడు గగ్గోలు పెట్టి ఇప్పుడు చేస్తున్నదేమిటి?

ఫిరాయింపు నిషేధ చట్టంపై కాంగ్రెస్ ద్వంద్వనీతి అవలంబిస్తున్నదని కేటీఆర్ దుయ్యబట్టారు. మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానాలో తమ పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ చేర్చుకుంటున్నదని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ తెలంగాణలో చేస్తున్నదేమిటని నిలదీశారు. తమ ఎమ్మెల్యేలను బీజేపీ చేర్చుకుంటున్నదని మహారాష్ట్ర పీసీసీ చీఫ్ బాలాసాహెబ్ థోరట్, కర్ణాటకలో తమ ఎమ్మెల్యేలను బీజేపీ 50 కోట్టు పెట్టి కొనుగోలు చేస్తున్నదని సీఎం సిద్ధరామయ్య ఆరోపించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కాంగ్రెస్‌కు గోవా, కర్ణాటక, మణిపూర్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంటుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవసరమైతే రాష్ట్రపతిని కలుస్తాం

కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఒక్కొక్కరికీ రూ. 50 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేస్తున్నదన్న ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆరోపణలను గుర్తుచేస్తూ తెలంగాణలో ఒక్కో ఎమ్మెల్యేను ఎంతకు కొనుగోలు చేస్తున్నారని కాంగ్రెస్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో న్యాయం కోసం ఢిల్లీలో నాలుగు రోజులుగా న్యాయ, రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు జరిపినట్టు తెలిపారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంత బహిరంగంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ వేశామని గుర్తు చేశారు. హైకోర్టులో న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించి రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామని వివరించారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. అవకాశమున్న వేదికల్లోనూ న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ బాధిత పార్టీలతో భవిష్యత్తులో పార్టీ ఫిరాయింపుల చట్టం బలోపేతం చేసేందుకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. 'పాంచ్‌న్యాయ్'లో కాంగ్రెస్ చెప్పిన విధంగా పార్టీ మారగానే ఆటోమెటిక్‌గా సభ్యత్వం రద్దయ్యేలా చట్టం తేవాలని కేటీఆర్ కోరారు.

ప్రజల పక్షాన పోరాటం

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ రాష్ట్రంలో చేస్తున్నదేమిటని కేటీఆర్ ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాలు, రుణమాఫీ, మహిళలకు 2,500, వితంతు, వృద్ధాప్య పింఛన్ 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు.. ఇలా మొత్తం 420 హామీలు ఇచ్చారని, వాటి సంగతేంటని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 4 లక్షల ఓట్ల తేడాతోనే ఓటమి పాలయ్యామని, ప్రధాన ప్రతిపక్షంగా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

రాళ్లతో ఇప్పుడెవర్ని కొట్టి చంపాలె?

కర్ణాటక, హర్యానా, మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేస్తుందని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టు తిరుగుతూ పార్టీలో చేర్చుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ మారిన వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలని గతంలో పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేస్తున్న పని ఏమిటని ప్రశ్నించారు. తమ పార్టీ టికెట్‌తో గెలిచిన ఎమ్మెల్యేలను అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడాలేకుండా ప్రతి ఇంటికీ తిరుగుతూ చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పుడు రాళ్లతో ఎవరిని కొట్టి చంపాలని ప్రశ్నించారు. ఎవరు పిచ్చికుక్కో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు.

ఆయారాం.. గయారాం.. పోచారాం

ఆరు గ్యారెంటీల్లో 420 హామీలిచ్చి వాటి అమలను గాలికి వదిలేసి ఎమ్మెల్యేలకు గాలం వేయడాన్నే పనిగా పెట్టుకున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయాలన్న ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడుతున్నదని ఆరోపించారు. తెలంగాణ హక్కుల రక్షణ విషయంలో తాము వెనక్కి తగ్గబోమని తేల్చి చెప్పారు. పార్టీ విలీనానికి, ఉద్దేశపూర్వక చేరికలకు తేడా ఉన్నదని చెప్పారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిర్దేశిత నియమాలకు అనుగుణంగానే తమ హయాంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా పార్టీని విలీనం చేశారని, అలాగే బీఎస్పీ నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు చేసిన విలీనాన్ని ఆయన వివరించారు. హర్యానాలో గయారాం అనే ఎమ్మెల్యే నుంచి పోచారాంను చేర్చుకోవడం వరకు దుర్మార్గ సంస్కృతిని కాంగ్రెస్ పెంచి పోషిస్తున్నదని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో రెండు రోజులపాటు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని సగటు సముద్ర మట్టానికి 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఎత్తులో ఉన్నట్లు తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.

డీఎస్సీ, గ్రూప్ 2ను వాయిదా వేయాలి

ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువత కోరుతున్నట్టు డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరారు. డీఎస్సీకి, గ్రూప్ 2 పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్నందుకు ప్రభుత్వం, టీజీపీఎస్సీ పునరాలోచించాలని కోరామని మంగళవారం విడుదల చేసిన వీడియోలో తెలిపారు. రాష్ట్రంలో పోటీ పరీక్షల అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి మంగళవారం టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో భేటీ అయ్యామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆవేదన, ఆందోళనను చైర్మన్ మహేందర్‌రెడ్డికి వివరించామని పేర్కొన్నారు.

వాస్తవాలు తెలుసుకోవాలి

ఎమ్మెల్సీ బల్మూరి

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగులు వాస్తవాలు తెలుసుకోవాలని, తాము బాధ్యతతో ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలకు తమ ప్రభుత్వం విడుదల చేసే జాబ్ క్యాలెండర్ పరిష్కారం చూపుతుందని తెలిపారు.

విద్యార్థుల డిమాండ్లు తీర్చాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ రూరల్, జులై 9: కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలకు పోకుండా విద్యార్థుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. మేడ్చల్ మండలంలోని మునీరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థులు రోడ్డెక్కారని, వారిపై లాఠీచార్జీలు చూస్తే బాధ కలుగుతుందని అన్నారు. నిరుద్యోగుల డిమాండ్లకు బీజేపీ మద్దతు పలుకుతూ, విద్యార్థుల ఉద్యమాల్లో పాల్గొంటామని చెప్పారు.

ఇది మీడియా ధర్నా

ఓయూలో ఏసీపీ జగన్ అసహనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ అభ్యర్థులను కించపర్చేలా ఏసీబీ జగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం డీఎస్ఈ ముట్టడిలో పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులు అర్ధరాత్రి పేట్లబురుజు నుంచి ఓయూకు తరలివెళ్లారు. ఓయూలో మంగళవారం ఉదయం భారీ పోలీసు బలగాలు మోహరించి వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లోకి బలగాలతో నడుచుకుంటూ వస్తున్న స్థానిక ఏసీపీ జగన్ మీడియాను చూసి 'క్యారీ ఆన్.. మీ పని మీరు చేసుకోండి.. మీడియా చేస్తున్న ధర్నా ఇది' అని వ్యాఖ్యానించారు. ఏసీపీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

మీడియాతో మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

- పార్టీలో చేరాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడుక్కుంటున్నరు
- 15న గద్వాలలో ప్రజాఆత్మగౌరవ సభ
- స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

గద్వాల, జూలై 9 : కాంగ్రెస్ సర్కారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్ సమన్వయకర్త, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆయన జోగుళాంబ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులు ఉండవని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి పార్టీలో చేరాలని అడుక్కుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ప్రజలకు దూరం చేయాలని కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తున్నదని.. అది వారి వల్ల కాదని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ నుంచి నడిగడ్డ ప్రజలను దూరం చేయలేరని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జెడ్పీటీసీ స్థానాలతోపాటు జెడ్పీ చైర్మన్ పదవిని సైతం కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 15న గద్వాల జిల్లా కేంద్రంలో ప్రజాఆత్మగౌరవ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్టు తెలిపారు. దళితులు, రైతులు, కౌలు రైతుల ఆత్మగౌరవసభలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సభల్లో కాంగ్రెస్ హామీల పేరిట చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణ ఏర్పాటు తర్వాత దానిని పూర్తిచేసి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బంగ్లా-బండ్లను ఓడించాలని పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బండ్లను భుజాలపై ఎత్తుకొని మోస్తున్నాడని విమర్శించారు. బండ్ల-బంగ్లా-ఎనుముల అంతా ఒకే వర్గానికే చెందినవారని.. వీరంతా కలిసి సబ్బండ వర్ణాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గద్వాల ప్రజలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించలేదని.. కారు గుర్తును చూసి ఓట్లు వేశారని తెలిపారు. నడిగడ్డలో బీఆర్ఎస్ పని అయిపోయిందని అనుకునే వారికి త్వరలో చెంప పగిలేలా ఉద్యమం చేస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములు, విష్ణువర్ధన్ రెడ్డి, కురువ పల్లయ్య, హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి తదితరులు

మెడికల్ కాలేజీలకు అనుమతుల్లో సర్కారు ఫెయిల్

- ఢిల్లీలో రాజకీయ పర్యటనలేనా ?
- ఫిరాయింపులపై ఉన్నశ్రద్ధ వైద్య విద్యార్థులపై లేదా ?
- బీఆర్ఎస్ కార్యాలయాల జోలికివస్తే తడాఖా చూపిస్తాం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎనిమిది మెడికల్ కళాశాలలకు మెడికల్ కౌన్సిల్ అనుమతులు నిరాకరించడం సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యమేనని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించకపోవడంతోనే ఎన్ఎంసీ అనుమతులు ఇవ్వడంలేదన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ హయంలో వైద్య విద్యను ప్రోత్సహించాలని ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని కేటాయించినట్టు చెప్పారు. ప్రతి వైద్య కళాశాలకు రూ.300 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారని గుర్తుచేశారు. 2024-25 సంవత్సరానికి 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దవాఖానలను నిర్మాణం చేసినా.. కాలేజీ అనుమతులపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతోనే సమస్య వచ్చిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులుగానీ ఢిల్లీలో సరైన విధంగా ఫాలోఅప్ చేయని ఫలితంగానే ఎనిమిది మెడికల్ కళాశాలలకు అనుమతులు రాలేదని ఆరోపించారు. ఇది రాష్ట్రానికి జరిగిన అవమానంగా బీఆర్ఎస్ భావిస్తున్నదని తెలిపారు. రేవంత్‌కు పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న శ్రద్ధ పేద వైద్య విద్యార్థుల భవిష్యత్ మీదలేదని మండిపడ్డారు.సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన వర్షపు నీరు

భద్రాద్రి జిల్లాలో విస్తారంగా వర్షాలు

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 9 (నమస్తే తెలంగాణ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆళ్లపల్లి, మణుగూరు, జూలూరుపాడు, పాల్వంచలో భారీ వర్షం కురవగా.. ఇతర మండలాల్లో మోస్తరుగా పడింది. దీంతో ముర్రేడు, మసివాగు, కిన్నెరసాని ప్రాజెక్టులోకి వరద నీరు చేరింది. దుమ్ముగూడెం మండలంలోని సీతవాగులో వరద నీరు ప్రవహిస్తున్నది. పాల్వంచలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది.

జాతీయ స్థాయిలో ఉద్యమిస్తాం

- నిరుద్యోగులను నిర్లక్ష్యంచేస్తే సహించం
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, జూలై 9: నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని వీడాలని, లేకుంటే జాతీయస్థాయిలో ఉద్యమిస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌లో నిరుద్యోగులతో ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ మాట్లాడి వారితో ఓట్లు వేయించుకున్నారని తెలిపారు. నేడు ఆయన ముఖం చాటేశారని ధ్వజమెత్తారు. విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య, ప్రజాసంఘాల సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమాఖ్య అధ్యక్షుడు కొంపెల్లి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి వారిపైనే నిర్బంధాలను విధిస్తున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యమాలను గౌరవించడాన్ని నేర్చుకోవాలని సీఎం రేవంత్‌కు హితవు పలికారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యమాలను గౌరవించారని, ఆయన ఎప్పుడూ అణచివేయలేదని తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారని, దానిపై నేడు ఎందుకు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. గ్రూప్ 1లో మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని ఏపీలో పాటిస్తుంటే, తెలంగాణలో న్యాయపరమైన చిక్కులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. గురుకుల పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ పెట్టాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగిని బౌన్సర్లతో బెదిరిస్తారా?

బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ ఎలా అయ్యాడో అర్థం కావడం లేదని, నిరుద్యోగుల కోసం ఆమరణ దీక్ష చేస్తున్న మోతీలాల్‌నాయక్‌ను గా